ఆర్టీఏలకు కొత్త కార్యాలయాలు

ఇప్పటికే అందుబాటులో రంగారెడ్డి ప్రధాన కార్యాలయం

త్వరలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మన్నెగూడ ఆఫీసు

మణికొండలోని రంగారెడ్డి జిల్లా ఆర్టీఏ ప్రధాన కార్యాలయం

సిటీబ్యూరో, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : మహా నగరంలో రెండు కొత్త ఆర్టీఏ భవనాలు అందుబాటులోకి వచ్చాయి. మణికొండలోని శివపురికాలనీలో సుమారు రూ.5 కోట్లతో కొత్త భవనాన్ని నిర్మించారు. ఇప్పటికే అత్తాపూర్‌లోని అద్దె బిల్డింగ్‌లో కొనసాగిన రంగారెడ్డి ఆర్టీఏ ప్రధాన కార్యాలయం కార్యకలాపాలను ఈ కొత్త భవనంలోకి మార్చారు. అధికారులు ఇక్కడి నుంచే కొన్ని రోజులు నుంచి సేవలు అందిస్తున్నారు. దీంతో పాటు మన్నెగూడలోని మరో ఆర్టీఏ కార్యాలయం పాత బిల్డింగ్‌లో కొనసాగుతున్నది. అక్కడే మరో కొత్త భవనాన్ని నిర్మించారు. ఈ భవన ప్రారంభోత్సవానికి సిద్ధం చేసిన సమయంలో ఎలక్షన్ కోడ్ రావడంతో ఆగిపోయింది. కొత్త ఏడాది మొదటి వారంలో ఈ భవనం ప్రారంభోత్సవం జరుగుతుందని రవాణా శాఖ అధికారులు తెలిపారు. కాగా గ్రేటర్‌లో 12 ఆర్టీఏ కార్యాలయాలున్నాయి. హైదరాబాద్‌లో ఖైరతాబాద్, సికింద్రాబాద్, మలక్‌పేట్, బండ్లగూడ, టోలిచౌకి, నాగోల్ ఉండగా మేడ్చల్‌లో డీటీవో మేడ్చల్, ఉప్పల్, కూకట్‌పల్లి ఉన్నాయి. రంగారెడ్డిలో మణికొండ, మన్నెగూడ, కొండాపూర్ కార్యాలయాలు సేవలు అందిస్తున్నాయి.

అడోబ్ సీఈవో శంతను నారాయణ్‌కు ఇంపాక్ట్ అవార్డును అందజేస్తున్న పాఠశాల యాజమాన్యం

ముగిసిన హెచ్‌పీఎస్ శతాబ్ది వేడుకలు

సిటీబ్యూరో, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ శతాబ్ది వేడుకల ముగింపు సందర్భంగా హెచ్‌పీఎస్‌లో 'ఎ నైట్ ఆఫ్ ఆనర్స్' కార్యక్రమం నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి బేగంపేట స్కూల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అడోబ్ సీఈవో శంతను నారాయణ్, కూ ఆఫ్ ప్రోక్టర్ అండ్ గాంబుల్ శైలేశ్ జెజురీకర్, ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికు గ్లోబల్ ఇంపాక్ట్ అవార్డులను స్కూల్ యాజమాన్యం అందజేసి గౌరవించారు. హెచ్‌పీఎస్ సొసైటీ ప్రెసిడెంట్ గుస్తీ నోరియా, కార్యదర్శి-కోశాధికారి జలగం వెంకట్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ స్కంద్ బాలి ఆధ్వర్యంలో హెచ్‌పీఎస్ అభివృద్ధికి కృషి చేసిన పూర్వపు అధ్యక్షులతోపాటు ప్రతినిధులను కీర్తించారు.

డ్రగ్స్ నిర్మూలనకు ప్రజలు సహకరించాలి

నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

షాదాన్ కళాశాల నిర్వహించిన ర్యాలీలో నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

బండ్లగూడ, డిసెంబర్ 28: రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రత్యేక దృష్టి పెట్టామని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని షాదాన్ కళాశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న 'పల్సేషన్-2023' కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులతో కలిసి డ్రగ్స్ నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరై, ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ.. షాదాన్ కళాశాల నిర్వాహకులను అభినందించారు. ఎక్కడైనా డ్రగ్స్ విక్రయిస్తున్నట్టు సమాచారం ఉంటే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న శ్రేయ పన్నాల

శ్రేయ అరంగేట్రం అదిరింది

రవీంద్రభారతి, డిసెంబర్ 28 : అభినయ కూచిపూడి కళాక్షేత్రం హైదరాబాద్ ప్రముఖ నాట్య గురువు పావని శ్రీలత ప్రసాద్ శిష్యురాలు శ్రేయ పన్నాల ఆరంగేట్రంలోనే ఔరా అనిపించింది. గురువారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో అభినయ కూచిపూడి కళాక్షేత్రం డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శ్రేయ పన్నాల కూచిపూడి రంగ ప్రవేశం కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, సౌజన్య శ్రీనివాస్, ప్రముఖ వక్త నండూరి శ్రీనివాస్, చరిత్రకారుడు ముదిగొండ శివప్రసాద్, ప్రొఫెసర్ అనురాధ జొన్నలగడ్డ, డాక్టర్ వనజ ఉదయ్ తదితరులు హాజరయ్యారు.

బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న రీతూ షా, హీనా శ్రీవాస్తవ, ఆర్తీ షా తదితరులు

7న ఫిక్కీ బిజినెస్ అవార్డుల ప్రదానం

ఖైరతాబాద్, డిసెంబర్ 28: కోఠి ఉమెన్స్ కాలేజీలోని బ్రిటీష్ రెసిడెన్సీలో జనవరి 7న ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బిజినెస్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ చైర్‌పర్సన్ రీతూ షా తెలిపారు. సోమాజిగూడలోని ది పార్క్ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వేడుకలకు సంబంధించిన బ్రోచర్లను ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ మాజీ చైర్‌పర్సన్ హీనా శ్రీవాస్తవ, హైదరాబాద్ చైర్ పర్సన్ ఆర్తీ షా, అపూర్వతో కలిసి ఆవిష్కరించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా మంత్రులు డి. శ్రీధర్ బాబు, ధనసరి అనసూయ సీతక్క హాజరవుతున్నారని తెలిపారు.

పలు రైళ్లు రద్దు

సిటీబ్యూరో, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్‌లోని పలు డివిజనల్ రైల్వే పరిధిలో పలు రైళ్లను రద్దు చేస్తూ గురువారం రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇందులో 28 రైళ్లను జనవరి 1 నుంచి 14వ తేదీ వరకు రద్దు చేసినట్లు తెలిపారు. ఆయా డివిజన్ల పరిధిలో కొనసాగుతున్న రైల్వే నిర్వహణ పనుల వల్ల ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అలాగే, జనవరి 16 నుంచి 27వ తేదీ వరకు టైమ్‌టేబుల్ వారీగా పరభాని- నాందేడ్ స్టేషన్ల మధ్య ఒక రైలును రద్దు చేశామన్నారు.

చర్లపల్లి కేంద్ర కారాగారాన్ని సందర్శించిన శిక్షణ న్యాయమూర్తుల బృందం సభ్యులతో జైళ్ల శాఖ ఐజీ మురళిబాబు, హైదరాబాద్ రేంజ్ డీఐజీ శ్రీనివాస్, డిప్యూటీ డైరక్టర్ వెంకటరామ్, జైలు అధికారులు

చర్లపల్లి జైలు సందర్శించిన న్యాయమూర్తులు

చర్లపల్లి, డిసెంబర్ 28 : చర్లపల్లి కేంద్ర కారాగారంను జిల్లా కోర్టు న్యాయమూర్తులు శిక్షణలో భాగంగా సందర్శించారు. వివిధ జిల్లాలకు చెందిన న్యాయమూర్తులు శిక్షణ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ వెంకటరామ్, జైళ్ల శాఖ ఐజీ మురళిబాబు, హైదరాబాద్ రెంజ్ డీఐజీ శ్రీనివాస్‌తో కలిసి సందర్శించి ఖైదీలు, సిబ్బందిని పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర కారాగారం సూపరింటిండెంట్ సంతోష్‌కుమార్ రాయ్ జైలులోని ఖైదీల స్థితిగతులు, వారి దినచర్య, ఖైదీలకు అమలు చేస్తున్న ఉపాధి కార్యక్రమాల వివరాలను న్యాయమూర్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కారాగారం డిప్యూటీ సూపరింటిండెంట్లు కృష్ణమూర్తి, శశికాంత్, కాళిదాస్‌తో పాటు జైలర్లు, డిప్యూటీ జైలర్లు, వైద్య అధికారులు, సిబ్బంది, ఖైదీలు తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో పాల్గొన్న నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

పోలియోపై నిమ్స్‌లో సదస్సు

ఖైరతాబాద్, డిసెంబర్ 28: నిమ్స్ దవాఖానలో గురువారం ఇమ్యూనో డెఫిసియన్సీపై సదస్సు జరిగింది. ఈ సదస్సును డైరెక్టర్ డాక్టర్ బీరప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో వ్యాప్తి, దాని వల్ల ప్రపంచ దేశాల్లో పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ క్లినికల్ ఇమ్యూనాలజీ విభాగాధిపతి, డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ సందీప్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కీర్తి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవా పురస్కారం

కేరళలోని తిరువనంతపురంలో జరిగిన ఐఎంఏ సెంట్రల్ కౌన్సిల్ 84వ వార్షిక సమావేశంలో ఐఎంఏ తెలంగాణ శాఖ గౌరవ కోశాధికారి డాక్టర్ రాజేందర్ యాదవ్‌కు ఉత్తమ సేవా పురస్కారాన్ని అందజేస్తున్న ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శరద్‌కుమార్ అగర్వాల్, సెక్రటరీ జనరల్ డాక్టర్ అనిల్ కుమార్, తదితరులు - సుల్తాన్‌బజార్, డిసెంబర్ 28

ఎమ్మెల్యే కసిరెడ్డికి సన్మానం

లక్ష్మీ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవానికి హాజరైన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని సత్కరిస్తున్న లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ చైర్మన్ జస్మత్ పటేల్, చిత్రంలో రాంపూర్ సర్పంచ్ ఎంఎస్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ ఎండీ నయీముద్దీన్ తదితరులు - సుల్తాన్‌బజార్, డిసెంబర్ 28